క్లుప్తంగా

డైరీల ఆవిష్కరణ



తిరుపతి అలిపిరి: తిరుమల తిరుపతి దేవస్థానం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీలను తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ బ్యాంకు అధ్యక్షులు చీర్ల కిరణ్, ఉపాధ్యక్షులు రంగనాయకులు, సునీల్ కుమార్, కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు. టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్ చేతుల మీదుగా 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

పాక్ల క్యాలెండర్



తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీ పాలిటెక్నిక్ ఆల్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ (ఏపీ పాక్ల) ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను సోమవారం తిరుపతిలోని సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ఆర్జేడీ ఎ.నిర్మల్‌కుమార్ ప్రియ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ లెక్చరర్స్‌గా పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలోలానే ఈ ఏడాది తమకు పనివేళలను 12 నెలలకు రెన్యువల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రవికుమార్, సురేష్‌కుమార్, లీనారాయ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



పాకాల : మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న కాశినాయన ఆశ్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ సభ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకులు మురళీధర్‌స్వామికి సోమవారం ఈ దుప్పట్లను అందజేశారు. ఆశ్రమంలో వృద్ధులకు, జాతర, పౌర్ణమి పూజలకు వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండేందుకు దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ సభ్యులు హరీష్, తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాదాల వితరణ



తిరుపతి కల్చరల్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని గోవింద సేవా మండలి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం 7 గంటల వరకు కపిలతీర్థం సర్కిల్లో సుమారు 10 వేల మంది భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు. కొత్త వీధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు వితరణ చేశారు.

బర్డర్స్ క్యాలెండర్ ఆవిష్కరణ



తిరుపతి అలిపిరి: తిరుపతి బర్డర్స్ (పక్షి ప్రేమికుల) బృందం తయారు చేసిన క్యాలెండర్‌ను తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌రెడ్డి ఆవిష్కరించారు. తిరుపతి బయోల్యాబ్‌లో బర్డర్స్ బృందం సభ్యులు డీఎఫ్‌వోను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. శేషాచల అటవీ ప్రాంతంలో తీసిన పక్షుల ఫొటోలతో తయారు చేసి 2023 క్యాలెండర్‌ను డీఎఫ్‌వో ద్వారా ఆవిష్కరించారు.

శ్రీనివాసమంగాపురం: ధ్వజస్తంభం నుంచి ఆలయంలోకి ప్రవేశిస్తున్న భక్తులు



శ్రీనివాసమంగాపురం: ధ్వజస్తంభం వద్ద శోభాయమానంగా పుష్పాలంకరణ



అలిపిరి పాదాల మండపం వద్ద స్వామి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు



ముక్కోటి వైభవం..మురిసిన భక్తజనం

- వైకుంఠ ఏకాదశి విశిష్టత
- పరవశించిన భక్తజనం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

తిరుపతి కల్చరల్: నిద్రనుంచి మేల్కొన్న మహావిష్ణువు వైకుంఠంలో ముక్కోటి దేవతలకు దర్శన భాగ్యం కల్పించిన రోజు ఈ వైకుంఠ ఏకాదశిగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రతి ఏటా మార్గశిర శుద్ధ ఏకాదశి రోజున ఈ ముక్కోటి ఏకాదశిని జరుపుకుంటారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం వైష్ణవ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలునిర్వహించారు. సూర్యుడు ధనురాశిలో ప్రవేశించగానే వచ్చే తొలి ఏకాదశే వైకుంఠ ఏకాదశి. శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన మాసం ధనుర్మాసం. ఇంతటి పవిత్రమైన వైకుంఠ ఏకాదశి నాడు వైకుంఠ ద్వారం నుంచి స్వామి వారిని దర్శిస్తే సర్వపాపాలు తొలగి వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. ఇందులో భాగంగానే వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగానున్న తిరుచానూరు పద్మావతి, అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి, నారాయణవనం కల్యాణ వేంకటేశ్వరస్వామి, నాగలాపురంలోని దేవ నారాయణస్వామి, శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీకాళహస్తిలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు తిరుపతి కోదండరామాలయం, చంద్రగిరి కోదండరామాలయం, కపిలేశ్వరస్వామి, ఇస్కాన్ మందిరం, శ్రీగోవిందరాజస్వామి ఆలయాల్లో వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. షిరిడీ సాయి మందిరాల్లోనూ వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు ఈ వైకుంఠ ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకుని పునీతులయ్యారు. దీంతో ఆలయాలు కిటకిటలాడాయి. అలిపిరిలోని శ్రీవారి పాదాల మండపంలో ప్రత్యేకంగా వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. తిరుమలకు నడకమార్గం కావడంతో ఆ ప్రాంతమంతా గోవింద నామస్మరణలతో మార్మోగింది. మంగళవారం కూడా పాదాల మండపంలో ద్వాదశిని పురస్కరించుకొని ఈ వైకుంఠ ద్వారాలను తెరచి ఉంచుతారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆలయాల డెప్యూటీ శాంతి, ఏఈవో రవికుమార్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి పూజలు

పాకాల : మండలంలోని నేంద్రగుంట వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయ నిర్వాహకులు భక్తుల కోసం వైకుంఠ ద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొల్పి అర్చనలు నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

సిద్ధేశ్వరస్వామికి విశేష పూజలు

ఎర్రావారిపాళెం: తలకోన శ్రీ సిద్ధేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు ఆలయ వేదపండితులు విశేష అభిషేకాలు చేసి పట్టువస్త్రాలు, ఆభరణాలు, వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆ తరువాత ఆలయానికి విచ్చేసిన భక్తులకు ప్రత్యేక అర్చనలు చేసి దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ప్రదోషకాల సమయంలో ఆది దంపతులు నంది వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.



ఎస్వీయూలోని శ్రీవారిని దర్శించుకున్న వీసీ



శ్రీనివాసమంగాపురం: వైకుంఠ ద్వారం

తరలివచ్చిన భక్త కోటి

చంద్రగిరి: భక్త జనం తరలివచ్చి శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు. ఆలయాన్ని వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. స్వామి వారిని తిరుప్పావై సేవతో మేల్కొలిపారు. అనంతరం స్వామి వారికి ఫల పుష్ప సుగంధ ద్రవ్యాలతో అభిషేక సేవను నిర్వహించారు. ఉదయం 12.50 గంటలకు ధనుర్మాసంలో వైకుంఠ వాకిలి ద్వారాన్ని తెరిచి, భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 7గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ఆస్థానం నిర్వహించారు. మంగాపురం ఆలయంలో టీటీడీ అధికారులు ఎంతో ప్రతిష్టాత్మకంగా వైకుంఠ వాకిలి ఏర్పాటు చేయడంతో ఊహించిన దానికన్నా అధికంగా భక్తులు తరలిరావడంతో, స్వామి వారి దర్శనం కోసం భక్తులు రెండు గంటలు క్యూలో వేచి ఉండాల్సి వచ్చింది. ఆలయ అధికారులు మహా లఘు దర్శనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్‌లు చెంగల్రాయులు, వెంకటస్వామి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం ద్వాదశి సందర్భంగా స్వామి వారికి చక్రస్నాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తెల్లవారుజామున 9 నుంచి 10 గంటల మధ్య ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లకు చక్రస్నానం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఎస్వీయూలో..

తిరుచానూరు: ఎస్వీయూలో ఏర్పాటు చేసిన శ్రీవారి ఆలయంలో స్వామివారిని కుటుంబ సమేతంగా వెటర్నరీ యూనివర్సిటీ వీసీ, ప్రొఫెసర్ పద్మనాభ రెడ్డి దర్శించుకున్నారు. ఆయన వెంట శ్రీవారి ఆలయ నిర్మాణ సాధన కమిటీ కన్వీనర్ డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఉన్నారు.

యాదాద్రి టు తిరుమల..!

తిరుపతి రూరల్: యాదగిరి గుట్ట ఆలయ నిర్మాణం సజావుగా పూర్తికావడంతో మొక్కులు చెల్లించుకునేందుకు యాదాద్రి ఆలయ స్థపతి డాక్టర్ జటవత్ మోతీలాల్‌నాయక్ తిరుమలకు పాదయాత్ర చేశారు. యాదాద్రి నుంచి 272 మందితో ప్రారంభమైన ఈ పాదయాత్ర 16 రోజుల పాటు కొనసాగి సోమవారం తిరుమలకు చేరింది. ఉదయం తిరుపతిలోని హథీరాంజీ మఠం వద్ద స్థానిక గిరిజన నేతలు వారికి ఘనస్వాగతం పలికారు. హథీరాం మహారాజ్ బోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. ఘనమైన చరిత్ర కలిగిన యాదాద్రి ఆలయ నిర్మాణానికి స్థపతిగా వ్యవహరించడం పూర్వజన్మ సుకృతమని డాక్టర్ జటవత్ మోతీలాల్‌నాయక్ అన్నారు. స్వామివారి దయతోనే 16 రోజుల పాదయాత్రను ఎలాంటి ఆటంకాలు లేకుండా దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. ఈకార్యక్రమంలో సర్దార్, పాండు, హథిరాం, చందు, పాప, రమేష్, తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన పలువురు గిరిజనులు పాల్గొన్నారు.



పాదయాత్రగా తిరుపతికి చేరుకున్న ఆలయ స్థపతి డాక్టర్ జటవత్ మోతీలాల్ నాయక్, గిరిజనులు

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ఎర్రావారిపాళెం: ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు చిన్నగొట్టిగల్లు సీడీపీవో రాజమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం రాజువారిపల్లె సెంటర్‌లో అంగన్‌వాడీ వర్కర్ పోస్టును ఎస్సీ కేటగిరికి కేటాయించినట్లు తెలిపారు. ఎర్రావారిపాళెం మండలం ఈడిగపల్లి, నాగినేనివారిపల్లె అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులను ఓసీ కేటగిరికి కేటాయించినట్లు పేర్కొన్నారు.

రామచంద్రాపురం మండలంలో...

రామచంద్రాపురం: మండలంలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని పుత్తూరు ఐసీడీఎస్ సీడీపీఓ పద్మజారెడ్డి అన్నారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ నడవలూరు మెయిన్ అంగన్‌వాడీ పోస్టు, పెద్దినాయుడుకండ్రిగ బీసీ–బీ, టీవీ సపార్లులో బీసీ–ఈ, పుల్లమనాయుడుకండ్రిగలో బీసీ–సీ, రాయలచెరువు హెచ్‌డబ్ల్యూలో ఓసీ కేటగిరికీ కేటాయించినట్లు తెలిపారు. ఈ నెల 7వ తేదీలోపు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.



అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్ర నాయుడుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైఎస్సార్ ఈపు రాష్ట్ర అధ్యక్షులు చల్లాచంద్రయ్య తదితరులు



డీపీటీవో చెంగల్‌రెడ్డిని సన్మానిస్తున్న బహుజన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు స్టార్ కృష్ణ

\- తిరుపతి అర్బన్

స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

తిరుపతి తుడా: స్పందన ఫిర్యాదులను పెండింగులో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష అధికారులను ఆదేశించారు. మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, ఎంఈ వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు లోకేష్ వర్మ, సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, మేనేజర్ చిట్టిబాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ షణ్ముగం, మునిసిపల్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పి.రవి తదితర అధికారులు పాల్గొన్నారు.



స్పందన అర్జీలను స్వీకరిస్తున్న మేయర్ శిరీష

ఫ్లెక్సీల నిషేధంపై తీర్మానం

తిరుపతి మంగళం : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మంగళంలోని పంచాయతీల్లో ఫ్లెక్సీల ఏర్పాటును నిషేధిస్తూ నాలుగు పంచాయతీల్లో మూకుమ్మడిగా తీర్మానం చేశారు. మంగళంలోని తిరుమలనగర్, సప్తగిరినగర్, రణధీర్‌పురం, మంగళం పంచాయతీలలో సర్పంచ్‌లు వకుళ, నాగభూషణమ్మ, లీలావతి, వరలక్ష్మి సోమవారం గ్రామసభలు నిర్వహించారు. ఫ్లెక్సీల ఏర్పాటుకు తప్పనిసరిగా పంచాయతీల అనుమతి తీసుకోవాలని వారు స్పష్టం చేశారు. అలా అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళం పంచాయతీలో శ్మశానవాటిక, అంగన్‌వాడీ కేంద్రం, సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, అశోక్‌రెడ్డి, ఉపసర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు: శ్రీపద్మావతి అమ్మవారిని పలువురు ప్రముఖులు సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో రవాణా శాఖ మంత్రి పినిపె విశ్వరూప్, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మహారాష్ట్ర సీఎం ఏక్ నాథ్ షిండే, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, డెప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి ఉన్నారు. వీరికి ఆలయ ఏఈవో ప్రభాకర్‌రెడ్డి వారికి ఆలయ మర్యాద పూర్వక స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు.

కేంద్ర మంత్రికి ఎంపీ స్వాగతం



కేంద్రమంత్రి భగవంత్ ఖుబాకి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి

తిరుపతి మంగళం: కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబా తిరుమలకు సోమవారం విచ్చేశారు. రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌లో తిరుపతి పార్లమెంట్ సభ్యుడు మద్దెల గురుమూర్తి దుశ్శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి వారికి స్వాగతం పలికారు.

చంద్రగిరి అభివృద్ధికి పటిష్ట చర్యలు

చంద్రగిరి: స్థానిక పంచాయతీ అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ ముదికుప్పం రూప తెలిపారు. పాత ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. 2023–24లో చేపట్టాల్సిన అభివృద్ధిపై గ్రామస్తులతో చర్చించారు. అందులో ఆమె మాట్లాడుతూ పంచాయతీ వ్యాప్తంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి చొరవతో ఇప్పటికే సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. సచివాలయాల నిర్మాణాలు, ధ్యానమందిరాలు, వాటర్‌ప్లాంట్లు తదితర వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌బాబు, కార్యదర్శి మహేశ్వరయ్య, ఎంపీటీసీలు బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, దెయ్యాల మాధవ రెడ్డి, సుబ్రత్, సుజాత పాల్గొన్నారు.



గ్రామ సభను నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రేపు లూయిస్ బ్రెయిలీ జయంతి

తిరుపతి కల్చరల్: నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ ఇండియా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ బుధవారం ఉదయం 8 గంటలకు ఎల్ఐసీ రోడ్డులోని ఆఫీసర్స్ క్లబ్ సమావేశ మందిరంలో అంధుల జీవిత ప్రదాత లూయిస్ బ్రెయిలీ 211వ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ కో-ఆర్డినేటర్ విజయశేఖర్‌రెడ్డి, కార్యదర్శి శంకర్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. దీనికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ బాలాజి, తిరుపతి అర్బన్ ఎస్పీ పరమేశ్వరరెడ్డి, దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాస్, నవజీవన్ రిలీఫ్ సెంటర్ అధ్యక్షుడు శ్రీధర్ ఆచారి హాజరవుతారని పేర్కొన్నారు. వీరితో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. దీనికి విచ్చేసే ప్రతి ఒక్క అంధునికి ఓ బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.నటరాజన్, సభ్యులు మురగదేవి, సుధాకర్, సోమశేఖర్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న సంస్థ కో-ఆర్డినేటర్ విజయశేఖర్‌రెడ్డి

దేశానికే ఆదర్శం.. జగనన్న 'సంక్షేమం'

- గడప గడపలోనూ విశేష ఆదరణ
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: దేశ రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడూ అందించలేనన్ని సంక్షేమ పథకాలు అందించి దేశానికే ఆదర్శంగా నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ మాకు ముఖ్యమంత్రిగా రావాలంటూ ప్రజలు కోరుకుంటున్నారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి 33వ డివిజన్ అశోక్‌నగర్‌లో కార్పొరేటర్ దూదికుమారి, ఆ డివిజన్ అధ్యక్షులు మద్దాలి శేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏ గడపకు వెళ్లినా ప్రజల నుంచి వారికి విశేష ఆదరణ లభించింది. హారతులతో మహిళలు నీరాజనం పలికారు. మూడేళ్ల పాలనలోనే జగనన్న తమకు చేసిన మేలు అంతా ఇంతా కాదని స్థానిక మహిళలు ఎమ్మెల్యే వద్ద ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసమే పనిచేసేది జగనన్న ప్రభుత్వమేనని చెప్పారు. రాష్ట్రంలో జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశ రాజకీయాలకే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అలాంటి నాయకుడికి ప్రజలు ఎల్లప్పుడూ అండగా నిలవాలని కోరారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

రేషన్‌డీలర్‌ను సస్పెండ్ చేయండి

కొర్లగుంట మెయిన్‌రోడ్డులో నిర్వహిస్తున్న రేషన్‌షాపులో ఆరు నెలలుగా లబ్ధిదారులకు కందిపప్పు, చక్కెర ఇవ్వడం లేదని 33వ డివిజన్ ప్రజలు ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. దాంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఆ రేషన్ డీలర్‌ను సస్పెండ్ చేయాలని ఏఎస్‌వోకి ఆదేశించారు. అని రేషన్‌షాపుల్లో ఇస్తుంటే ఇక్కడ ఎందుకు ఇవ్వడం లేదని, పూర్తిగా విచారించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, వరికుంట్ల నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు దూది శివకుమార్, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, బాలశెట్టి కిషోర్, తాలూరి ప్రసాద్, పద్మజ, గోలి విజయలక్ష్మి, కంకణాల రమేష్, నాధముని తదితరులు పాల్గొన్నారు.

మందుబాబుల ఆగడాలను అరికట్టాలి

తిరుపతి నగరంలో మందుబాబుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని, వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి పోలీసులను ఆదేశించారు. నివాసాల మధ్యన, ప్రధాన మార్గాలలో విచ్చలవిడిగా మద్యం తాగి, వీరంగం సృష్టిస్తుంటే పోలీసులు ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొర్లగుంటలోని బాలాజీ ఆస్పత్రి పక్కన, జీవకోనలోని కొండ శివారు ప్రాంతంలో ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద, మొండోడికోన, రుయా ఆస్పత్రి ఎదురుగా నిర్మాణంలో ఉన్న టూరిజం భవనం, ఇందిరానగర్‌లోని వైన్‌షాపు వద్ద ఆటోలే, రైల్వేపట్టాల వద్ద మందుబాబుల ఆగడాలు విపరీతంగా ఉన్నాయని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన మందుబాబులకు అడ్డాగా ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. వెంటనే ఈ ప్రాంతంలో పోలీసులు నిఘా పెట్టి మందుబాబుల ఆగడాలను అరికట్టాలని పోలీసులను ఆదేశించారు. మరోసారి మందుబాబులపై ప్రజల నుంచి ఫిర్యాదు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

559 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : తిరుపతిలో గత నెల మద్యంతాగి వాహనాలు నడపడం, పేకాట తదితర నేరాలకు పాల్పడిన 599 మందికి 515 కేసుల్లో రూ.7,14,530 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్, ఈస్టు, వెస్టు, అలిపిరి, ఎస్వీ యూనివర్సిటీ స్టేషన్ల పరిధిలో వివిధ నేరాలకు పాల్పడినవారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.7వేలు జరిమానా విధించారు.